


రాత్రి పడుకోబోయేముందు కొడు కు మెల్లిగా చెవిన వేసిన పిడుగు లాంటి వార్తకు వణుకు పుట్టుకొచ్చి, అయోమయంలో పడ్డ రమణమ్మకి ఆ రాత్రి నిద్రపట్టక తెల్లవార్లూ తెగ బాధపడింది.

కంటికి కునుకులేని కారణం గా తల చిటచిటలాడిపోతున్నా లక్ష్యపెట్టక, తూర్పు తెల్లబడకనే కాలకృత్యాలు తీర్చుకుని, స్నానా నంతరం పారాయణకై భగవద్గీత పట్టుక్కూచుందేగానీ మనసు కుదు టపడలేదు. అక్షరం ముందుకు సాగలేదు. పిచ్చెత్తినట్టయిపోయి తనలోతానే ఏదో గొణుక్కుంటూ భగవద్గీతనలా పక్కనే వున్న టేబుల్ మీద పెట్టేసి, పక్క వీధిలో అటు చివరగా వున్న రిటైర్డ్ రెవెన్యూ ఆఫీ సర్ రామమూర్తిగారింటికి వెళ్లి, ముఖద్వారానికి పక్కనేవున్న కాలిం గ్‌బెల్ స్విచ్ నొక్కింది.

తలుపు తీసిన రామమూర్తి గారు రమణమ్మను చూడగానే

# పెద్ద మనసు

## యం.సి. శివశంకరశాస్త్రి

చిర్నవ్వుతో నమస్కరించి లోనికి రమ్మని సైగ చేస్తూ "చలిలో పొద్దుటే ఇటొచ్చారేంటమ్మా?" అడిగేడు.

కనుకొలకుల్లో నీళ్లు నిండుకొనివుండగా సర్వం కోల్పోయినదానిలా దిగాలుగా వెళ్లి గమ్మున సోఫాలో కూలబడిపోయింది.

"అలా వున్నారేంటమ్మా?... ఆరోగ్యంగానీ బాగోలేదా ఏమిటి?" విషయం తెలుసుకోగోరి ప్రశ్న.

రామమూర్తిగారి ప్రశ్నకు రమణమ్మ కళ్లల్లో నీళ్ళు పెల్లుబికివచ్చాయ్.

"అంతలా బాధపడిపోతున్నారేం? ఎవరేనా ఏమేనా అన్నారా? లేక జరగరానిదేమయినా జరిగిందా?" అసలు విషయం కనుక్కొనే ఉద్దేశ్యంతో గట్టిగా అడిగేడీసారి.

"కొడుకు చేస్తున్న నిర్వాకానికి చావాలో బతకాలో కూడా తేల్చుకోలేని స్థితిలో ఆత్మీయులైన మీముందు నా బాధ వెళ్లగక్కుకుంటే మనసు కొంతలో కొంతయినా కుదుటపడుతుందన్న భావనతో ఇలా వచ్చానయ్యా!" జీరవోయిన గొంతుకతో పల్కి, కన్నీరు తుడుచుకుంది రమణమ్మ.

"ఇంతకీ విషయమేంటో చెప్పారుకాదు..."

"ఏం చెప్పమంటారు? ఎల్లుండి నన్ను తీసుకెళ్లి ఓల్డేజ్ హోమ్‌లో చేర్చేసి వస్తాడట" కుముల్తూ బదులు చెప్పింది.

"ఎందుకూ?" వెంటనే ప్రశ్నించేడు.

"బహుశా వాళ్ళకి బరువయ్యుంటాను... రాత్రి పడుకోబోయే ముందు మెల్లిగా నా గదిలో కొచ్చి విషయం చెవిన పడేసి వెళ్ళాడు" ఆమె గొంతుకలోంచి హీనస్వరంతో వచ్చాయి మాటలు.

"మీ ఆస్తిపాస్తులతో అతను, అతని భార్యా సర్వసుఖాలను అనుభవిస్తూ అవసానదశలో వున్న మిమ్మల్ని తీసుకెళ్లి దిక్కులేని దానిగా ఎక్కడో చేర్చి రావడమేమిటి? వాళ్లకేదో పోగాలం దాపురించిందిలా వుంది" కోపాన్నాపుకోలేక తిట్టిపోసింది అక్కడే నుంచున్న రామమూర్తిగారి భార్య సీతాలక్ష్మి.

"నయవంచకులమ్మా!... నయవంచకులు"

"ఛీ!ఛీ!! పిదప మనుషులు... పిదప బుద్ధులు. మీకు సంతానం లేని కారణంగా మరిదిగారబ్బాయినే కడుపున పుట్టిన బిడ్డగా చేరదీసి విద్యాబుద్ధులు చెప్పించటంతోపాటు మీ యావదాస్తినీ అతనికి రాసిచ్చినందుకు విశ్వాసంగా పడుండటంమాని మిమ్ములనిలా హింసిస్తే పాపానపడి ఛస్తారు దుర్మార్గులు" వాళ్ల దుశ్చర్యను సహింపజాలక కోపంగా అనేశాడు రామమూర్తి.

"అంతే కాదండీ! కొడుకు, కోడలూ కలిసి కట్టుగా చేస్తున్న ఆగడాలు అంతా ఇంతా కాదంటే నమ్మండి. కడుపు చింపుకుంటే కాళ్ల

మీద పడుతుందన్నట్టు ఇంటికథ చెప్పుకుంటే మా పరువంతా గంగకలిసి పోతుందని వాళ్లేం చేసినా, ఎంత హింసించినా కడుపున దాచుకో వటమయింది. చెప్పుకోకూడదుగానీ బాగా ఆకలివేసిన రోజున ఓ పిడికెడు అన్నం ఎక్కువ తింటే ఈ ముసలిముండకింకా తిండియావ చావలేదంటూ వాళ్ల గదిలో కూచుని ఆలుమగ లనుకుంటూండగా ఎన్నోసార్లు విన్నాను. ఒక్కో సారి కోడలు తెగ ప్రేమాభిమానాలొలకబోస్తూ అత్తయ్యా! మీరిక్కడే కూచుని టీ.వీ. ప్రోగ్రామ్ చూస్తూండండి, అన్నం కలుపుకు తీసుకొస్తా నంటూ వంటింట్లోకెళ్లి, చిన్నపిల్లలు తినగా మిగిలిన ఎంగిలన్నమంతా ఓ కంచంలో పడేసు కుని దాని పక్కనే ఇంత పప్పు, పచ్చడి వేసుకు పట్టుకొచ్చి తినబెట్టిన రోజులు కూడా బోల్డున్నా య్. నా మనుమలే ఈ విషయం నాకు పలుమార్లు చెప్పారు" గద్గదకంఠంతో అంది.

"ఛీ!ఛీ!! ఏం మనుషులండీ వాళ్లు..." అంటూ నోరు నొక్కుకుంది సీతాలక్ష్మి.


"మరీ దారుణమయిన విషయం కూడా వినండి. మొన్న దీపావళి పండుగ రోజున స్నానం చేసేందుకు నేను బాత్‌రూమ్‌లో కెళ్ల గానే కోడలమ్మ నా వెనకాలే గబగబా ఓ సీసా నిండా కిరోసిన్ పట్టుకొచ్చి చప్పున నానెత్తిన గుమ్మరించేసి అగ్గిపుల్ల గీయబోయింది. ఆ బల వంతపు చావుకు భయపడి లబోదిబోమంటూ మొత్తుకునేసరికి అబ్బాయొచ్చి 'చాలుచాల్లే వమ్మా! కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకో బోతున్న నిన్ను వద్దని వారించినందుకు... గమ్మున పడుండాల్సిందిమాని, కిరోసిన్ పోసి తగలబెట్టుతోందంటూ... నేరం దానిమీదికే నెట్టి అల్లరి పెడుతున్నావా? చేసిన నిర్వాకం చాలుగానీ గమ్మున నోరుమూసుకు పడుండు' అంటూ నానా చీవాట్లూ పెట్టి, పైగా నాపై చేయిచేసుకున్నాడు. ఇలా చెబుతూ పోతే ఇంకా బోల్డున్నాయండీ! అంటూ ఇంట జరుగుతున్న అగడాల్లో ఒకటి రెండు వివరించి చెప్పి, ఇక దుఃఖాన్నాపుకోలేక ఘొల్లున ఏడ్చేసిందా వృద్ధ జీవి.

"ఇలాంటి తప్పుడు వ్యవహారాలు జరుగు తాయన్న తలంపుతోనే ముందుచూపుగా ఆలో చించి అమ్మా! ఓ అనాథ శిశువును తెచ్చి పెంచుకుంటే మీకు పిల్లల్లేని లోటు తీరటంతో పాటు ఓ అనాథకు ఆశ్రయం కల్పించినవా రవుతారని మీకు పదేపదే చెప్పినా మీరు నా మాట ఖాతరు చేయకపోగా మా మరిదిగా రబ్బాయి చాలా మంచివాడు. ఉత్తముడైన పిల్లవాడింటవుండగా ముక్కూ మొహం తెలి యని ఏ అనాథనో తెచ్చుకుని వాడికి నా ఆస్తి ధారపోయడమెందుకని మీ మరిదిగారబ్బాయి మీద ప్రేమ - ఆప్యాయత ఒలకబోశారు. నేననకూడదుగానీ ఇదంతా మీ స్వయంకృతా పరాధం తప్ప మరేమీకాదు". అప్పట్లో తాను చెప్పిన మంచి మాటల్ని మన్నించక పెడచెవిని బెట్టినందుకే ఇలా అయిందని కొంచెం నిష్ఠూ రంగానే అన్నాడు రామమూర్తి.

"అయిందేదో అయిపోయిందిగానీ కనీసం ఇప్పుడైనా నా మాట వినండి" గట్టిగా అన్నా డాయన.

ఏమిటది? అన్నట్టు ఆయన ముఖంలోకి చూసింది రమణమ్మ.

"ఆస్తిపాస్తుల విషయమై ఏ లాయరుతో వీలునామా రాయించారో మళ్లీ ఆ లాయరు గారి దగ్గరికే వెళ్లి, అతనిపేర రాయించిన వీలునామా రద్దుపరుస్తూ అతనికి, మీ ఆస్తికీ ఎలాంటి సంబంధమూ లేదని రాయించేస్తే కీలెరిగి వాత పెట్టినట్టయిపోతుంది" తన మన




సున వున్నది బహిర్గతం చేశాడు రామమూర్తి.

వేదాంతిలా నవ్వింది రమణమ్మ.

అయోమయంగా ఆమె ముఖంలోకి చూశారు రామమూర్తి దంపతులు.

"మీ మాట కాదనలేను... కానీ...!" అంటూ మాట సగంలోనే ఆపేసింది.

"మీ పిచ్చిగానీ ఇంకా కానీ... గీనీ అంటూ వేదాంతం చెబుతారేంటమ్మా? దయచేసి నామాట విని వీలునామా రద్దు చేయించండి!" అన్నాడు రామమూర్తి.

"వయసు పెరిగిన కొలదీ మనసూ, బుద్ధీ కూడా పెంచుకుంటేనే మనిషి మనిషిగా పరిగణింపబడతాడని నా చిన్నతనంలో మా నాయనమ్మ చెప్పేది. ఇందులో ఏ మాత్రం అబద్ధంలేదు. ఏ వ్యక్తయినా మనసున్న మనిషిగా బతకడం అలవరచుకోవాలే తప్ప కక్ష, కార్పణ్యాలతో సాధించగలిగేదేముంది చెప్పండి? వాళ్ళు నన్ను బాధపెడుతున్నారని ప్రతీకారచర్యగా నేనూ అదే మార్గాన్ని ఎంచుకుంటే ఇక వాళ్ళకి, నాకూ తేడా ఏముంటుంది? నిజం చెప్పాలంటే నేను వాళ్లని దండించనక్కరలేదు. నా మానాన నేను గమ్మున పడుంటే తగు సమయమాసన్నమయినప్పుడు కాలమే గుణపాఠం నేర్పుతుంది వాళ్ళకి. ఎవరి ఖర్మకు వాళ్లే బాధ్యులవుతారు తప్ప ఇతరులుకారు" నింపాదిగా అంటూ సోఫాలోంచి లేచి 'ఇకనే వెళ్లొస్తానండీ!' అని చెప్పి మెల్లిగా బయటికి నడిచింది ఎనభై ఏళ్ల పండుముదుసలి రమణమ్మ.

ఆమె ఆస్తిపాస్తులు చేజిక్కించుకుని సర్వ సుఖాలనూ అనుభవిస్తూ చివరికామెను దిక్కులేనిదానిగా చేయతలపెట్టిన విశ్వాసఘాతకుణ్ణి దండించే విషయం కాలానికే వదిలిపెట్టి వెళ్తున్న రమణమ్మగారి విశాల మనోభావానికి, మనోనిబ్బరతకూ ఆశ్చర్యపోతూ వణుకుతూ వెళ్తున్న ఆమెకేసి చూస్తూ బొమ్మల్లా నుంచుండిపోయారు రామమూర్తి దంపతులు. ●